హైడ్రాను మూసేస్తం!

మొదటిపేజీ తరువాయి...

ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోరా? ఎన్ని సార్లు చెప్పినా మారరా? ఇలాగైతే హైడ్రాను మూసేస్తాం..' అంటూ హైకోర్టు హైడ్రాను తీవ్రస్థాయిలో మందలించింది. 'జలవనరులు, రోడ్లు, ప్రభుత్వ భూముల రక్షణకు కోర్టులు ఎప్పుడూ వ్యతిరేకం కాదు. అయితే, అందుకు తీసుకునే చర్యలు చట్టబద్ధంగా ఉండాలి. మీ ఇష్టం వచ్చినట్టు చేస్తామంటే ఉపేక్షించే ప్రసక్తే లేదు. అక్రమ నిర్మాణాలైనప్పటికీ కూల్చివేత చర్యలు చట్టప్రకారం ఉండితీరాల్సిందే. ఏం చర్యలు తీసుకున్నప్పటికీ అవి చట్టానికి లోబడి లేకపోతే ఎలా?' అంటూ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. రాత్రికి రాత్రే నగరాన్ని మార్చలేరని పేర్కొంది. సెలవు రోజుల్లో కూడా కూల్చివేతలు చేపడితే ఇక హైడ్రా అంటే భరోసా ఎలా కలుగుతుందని నిలదీసింది. హైడ్రా చర్యలు భరోసాకు బదులు భయాందోళనకు గురి చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. హైడ్రా ఏర్పాటు జీవో 99ను చదివారా? ఆ జీవోలోని నిబంధనల ప్రకారమే విధులు నిర్వహించాలని తెలియదా అని వ్యాఖ్యానించింది. నిబంధనల పరిధి దాటి వ్యవహరిస్తే హైడ్రాను మూసివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. హైడ్రాను అడ్డుపెట్టుకొని కొంతమంది వ్యక్తిగత కక్షలతో ఆరోపణలు చేస్తున్నారని, వాటి ఆధారంగా కూల్చివేతలు చేయడం సబబు కాదని హితవు చెప్పింది. కేవలం పత్రాలను చూసి హక్కులను ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించింది. హక్కులు నిర్ణయించే అధికారం హైడ్రా అధికారులకు ఎక్కడ ఉందంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. నోటీసులు ఇచ్చి వివరణ ఇవ్వడానికి తగిన గడువు ఇచ్చి చట్టప్రకారం కూల్చివేతలు ఉండాలని చెప్పినప్పటికీ ఎందుకు చేయడం లేదని నిలదీసింది. హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు.

దోపిడీ దొంగలు మాత్రమే అలా చేస్తారు

'కూల్చివేతలకు తొందర ఎందుకు? ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటి? ఓసారి తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రహరీ కూల్చివేశారు. దోపిడీ దొంగలు మాత్రమే అలా వ్యవహరిస్తారు. ఏ సమాచారం లేకుండా సెలవు రోజున కూల్చివేయడం ఏమిటి? హైకోర్టు పుల్‌బెంచ్ ఆర్డర్ ఇచ్చినా ఖాతరు చేయరా?' అని హైకోర్టు నిలదీసింది. దీనిపై హైడ్రా న్యాయవాది స్పందిస్తూ, ఇకపై సెలవు రోజున కూల్చివేతలు లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ప్రతిసారి విచారణ సమయంలో మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పడం హైడ్రాకు పరిపాటిగా మారిందని వ్యాఖ్యానించింది. హైడ్రా తప్పులకు ఓ రిజిస్ట్రర్ నిర్వహించాల్సిన పరిస్థితి కూడా రావొచ్చునని వ్యాఖ్యానించింది.

ఇలాంటివి 20 ఉత్తర్వులు ఇచ్చాం

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండలం, ముత్తంగి గ్రామంలో తన స్థలానికి సంబంధించిన పత్రాలను సమర్పించినప్పటికీ వాటిని పరిశీలించకుండానే తన షెడ్‌ను కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ ఏ ప్రవీణ్ అనే వ్యక్తి దాఖలుచేసిన పిటిషన్‌పై గురువారం న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన హైడ్రాను తీవ్రస్థాయిలో మందలించారు. పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. ప్రవీణ్ 2023 నవంబర్ 15న పంచాయతీ అనుమతులు తీసుకుని నిర్మాణం చేపట్టారని చెప్పారు. హైడ్రా తరపు న్యాయవాది ప్రతివాదన చేస్తూ, ముత్తంగి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన అనుమతులను రద్దు చేశారని తెలిపారు. గతంలో బెదిరించి అనుమతులు తీసుకున్నారని, తర్వాత పంచాయతీ కార్యదర్శి వాటిని రద్దు చేస్తూ తిరిగి ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. అన్ని పత్రాలను పరిశీలించాకే హైడ్రా చట్ట నిబంధనలకు లోబడి చర్యలు తీసుకున్నదని అన్నారు. సుప్రీంకోర్టు కూడా రోడ్లకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని బుల్డోజర్ కేసులో చెప్పిందని గుర్తుచేశారు. ఇదే కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు చట్టపరమైన ప్రక్రియ ద్వారానే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు, తీవ్రస్థాయిలో హైడ్రాపై అసహనం వ్యక్తంచేసింది. తాము 20కి పైగా ఇలాంటి ఉత్తర్వులు జారీచేశామని, అయినా పిటిషన్లు దాఖలవుతున్నాయని గుర్తు చేసింది. పంచాయతీ కార్యదర్శిని బెదిరించి అనుమతులు తీసుకున్నారని హైడ్రా ఎలా చెప్తుందని నిలదీసింది. 2023లో పంచాయతీ కార్యదర్శి అనుమతులు మంజూరు చేస్తే 2025లో వాటిని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించింది. రెండేండ్లపాటు ఏం చేశారని మండిపడింది. గత విచారణ సందర్భంగా ఈ ఉత్తర్వులను ఎందుకు సమర్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. పార్కు స్థలాన్ని కబ్జా చేశారని గాయత్రి మెంబర్స్ అసోసియేషన్ చేసిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టామంటున్న హైడ్రా, అదే అసోసియేషన్ హైడ్రా రాకముందు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించింది. స్థలం హక్కులను నిర్ధారించే హక్కు హైడ్రాకు ఎవరిచ్చారని ఆగ్రహం వ్యక్తంచేసింది. హక్కులను నిర్ణయించాల్సింది సివిల్ కోర్టు అనే విషయం కూడా తెలియకుండా విధులు నిర్వహిస్తున్నారా? అని ప్రశ్నించింది. ఆస్తిపై హక్కులను సివిల్ కోర్టులు మాత్రమే తేల్చాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా తేల్చవనే విషయాన్ని ఎలా మరిచిపోతారని మండిపడింది. అక్కడ లేఔట్‌కు అనుమతులను సర్పంచ్ మంజూరు చేశారని, నిజానికి పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వాలనే నిబంధనను గుర్తుచేసింది. పిటిషనర్ అక్రమ నిర్మాణం చేశారని ఎలా నిర్ధరణకు వచ్చారని హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను ప్రశ్నించింది. ఆక్రమణదారు డంటే నిర్వచనం ఏమిటో చెప్పాలని నిలదీసిది. పిటిషనర్‌కు చెందిన స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలుచేయాలని ఆదేశించింది. ఇదే తీరును కొనసాగిస్తే హైడ్రా ఏర్పాటు జీవో 99ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని హెచ్చరించింది. తదుపరి విచారణను మార్చి 5వ తేదీకి వాయిదా వేసింది.

జగద్గిరిగుట్టలో హైడ్రా కూల్చివేతలు

జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 20: హైదరాబాద్ జగద్గిరిగుట్టలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్ , గాజులరామారం డివిజన్‌లోని మహదేవపురం, కూకట్‌పల్లి డివిజన్‌లోని పలుచోట్ల 10 బేస్‌మెంట్లు, ఒక స్లాబ్ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ ప్రాంతంలో రెండుసార్లు పర్యటించారు. ఈ నేపథ్యంలో గురువారం జగద్గిరిగుట్ట పోలీసులు, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. జగద్గిరిగుట్టలో హైడ్రా తొలగింపులు జరుగుతుండగా తన బేస్‌మెంట్ కూల్చివేశారని రవి అనే వ్యక్తి జేసీబీ వద్ద ఆందోళనకు దిగాడు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట ఫుట్‌పాత్‌పై నిలుచున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

గుమ్మడి నర్సయ్యకు తీవ్ర అవమానం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక నివాసం వద్ద.. నిన్న సెక్రటేరియట్ దగ్గర.. చివరకు గురువారం ఆయన ఇంటి వద్ద మరోసారి పడిగాపులు గాసినా.. సీఎం రేవంత్‌రెడ్డి ఆయన్ను కలిసేందుకు ఇష్టపడలేదు. చివరకు ఇంటిగేటుముందు గంటల తరబడి వేచి చూసిన నర్సయ్యకు నిరాశే మిగిలింది. రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లో వెళ్తుంటే.. నర్సయ్య దీనంగా ఆయన వంక చూస్తున్నా.. సీఎం చూసీచూడనట్టు వెళ్లిపోవటం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. దీంతో 'అయ్యో.. ఏందిసారూ ఇలా చేశారు.. పెద్దమనిషిని ఎండల తిప్పిస్తవా? ప్రజా సమస్య మీదనే వచ్చారుగా.. పాపం కలిసే అవకాశం ఇస్తే ఏమైంది?' అని ప్రజా ఉద్యమకారులు రేవంత్‌రెడ్డిని అడుగుతున్నారు.

రోజంతా ఎండలో నిలబడ్డా..

ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐఎంఎల్(న్యూ డెమోక్రసీ) నాయకుడు గుమ్మడి నర్సయ్యకు గురువారం తీవ్ర అవమానం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు మంగళవారం హైదరాబాద్ వచ్చిన ఆయన రోజుల తరబడి ఎండలో వేచి చూసినప్పటికీ ఆయన్ను కలిసేందుకు సీఎం అంగీకరించలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజరవర్గంలో పోడు భూములపై గిజనులకు హక్కులు కల్పించాలని, సీఎం ప్రకటించిన రైతు భరోసా డబ్బులు ఇప్పటి వరకు ఖాతాల్లో పడలేదని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కావటం లేదని రిప్రజెంటేషన్ ఇచ్చేందుకు గుమ్మడి నర్సయ్య హైదరాబాద్‌కు వచ్చారు. తనకు పరిచయం ఉన్న అధికారుల ద్వారా సీఎం అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించారు. మంగళవారం ఉదయం సీఎం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఉన్నట్టు తెలియటంతో అక్కడికి వెళ్లారు. మధ్యాహ్నం లేదా సాయంత్రం లోపు సీఎం కలిసే అవకాశం ఉందని సిబ్బంది చెప్పడంతో రోజంతా ఎండలోనే నిలబడి వేచిచూశారు. కానీ, సీఎం ఆయన్ను కలిసేందుకు అనుమతించలేదు.

కాన్వాయ్‌కి ఎదురెళ్లినా..

బుధవారం సీఎం సెక్రటేరియట్‌లోఉన్నారనే సమాచారం అందుకున్న నర్సయ్య ఉదయమే అక్కడికి వెళ్లారు. మరోసారి ముఖ్యమంత్రి అనుమతి కోసం ప్రయత్నించారు. తనకు పరిచయం ఉన్న అధికారులతో సీఎం కార్యాలయానికి ఫోన్ చేయించి సమాచారం ఇచ్చారు. ఏ సమయంలోనైనా సీఎం పిలవచ్చనే ఆశతో రోజంతా సెక్రటేరియట్ గేట్ బయటే పడిగాపులు కాచారు. దినం గడిచింది కానీ, సీఎం నుంచి పిలుపు రాకపోవడంతో ఆయన నిరాశతో వెనుదిరిగారు. గురువారం ఉదయం మరోసారి సీఎం నివాసం జూబ్లీహిల్స్‌కు వెళ్లి ఆయన్ను కలిసేందుకు ప్రయత్నించారు. ఎండలో గంటల తరబడి బయట వేచిచూసినప్పటికీ నర్సయ్యను లోపలికి అనుమతించలేదు. సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్తున్న ముఖ్యమంత్రిని గమనించిన గుమ్మడి నర్సయ్య సీఎం కాన్వాయ్‌కి ఎదురెళ్లినా.. చూసీచూడనట్టుగా వెళ్లటంతో తీవ్ర అవమానంతో వెనుదిరిగారు.

ఏ సీఎం నన్ను ఇలా అవమానించలే..

నేను ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన. నా నియోజకవర్గంలో ప్రజాసమస్యలపై రిప్రజెంటేషన్ ఇచ్చేందుకు వచ్చిన. ఇది మొదటిసారి కాదు. నాలుగోసారి. ఒక్కసారి కూడా సీఎం రేవంత్‌రెడ్డి నాకు అపాయింట్‌మెంట్ ఇయ్యలేదు. నేను ఎన్టీఆర్ దగ్గరి నుంచి మొదలు రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ వరకు ముఖ్యమంత్రులను చూశాను. ఏ సీఎం కూడా నన్ను ఇట్ల అవమానించలేదు. ప్రజా సమస్యల మీద రిప్రజెంటేషన్ ఇవ్వటానికే వచ్చాను. గిరిజనులకు పోడు భూములపై హక్కులు కావాలని కోరేందుకు వచ్చాను. రైతు భరోసా పడ్డదని సీఎం చెప్పిండ్రు. కానీ, ఇంతవరకు రైతు భరోసా అందలేదు. ఈ సమస్యలు రేవంత్‌రెడ్డికి చెప్పటానికి మూడ్రోజుల కింద హైదరాబాద్‌కు వచ్చిన. సీఎం ఇంట్లో ఉన్నాడంటే ఇంటికి పోయిన. సెక్రటేరియట్‌లో ఉన్నాడంటే అక్కడికి వెళ్లిన. ఇయ్యాల ఇంట్లనే ఉంటడంటే మళ్లీ ఇంటికి పోయిన. ఎన్ని సార్లు ప్రయత్నించినా కలువలేదు. రైతు బంధు ఇయ్యమని ఎవరడిగిండ్రు? కేసీఆర్ రూ.10 వేలు ఇస్తన్నడు.. నేను రూ.15 వేలు ఇస్త అని చెప్తివి. ఓట్లేయించుకొని గెలిచినంక రూ.12 వేలే ఇస్తంటివి. అవి కూడా ఇప్పటి వరకు పడకపాయే. రేవంత్‌రెడ్డి నాపై నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నట్టుగానే భావిస్తున్నా.

- గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే

నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన మూడు కేసుల్లో ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం కోర్టుకు హాజరయ్యారు. నల్గొండ టూటౌన్, బేగంబజార్, మెదక్ జిల్లా కౌడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో తప్పక హాజరుకావాలని కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సీఎం హాజరయ్యారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు చేశారని, రాష్ట్రంలోని పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని రేవంత్‌పై కేసులు నమోదయ్యాయి. నేరం చేశారా? అని రేవంత్‌ను కోర్టు ప్రశ్నించగా, చేయలేదని సమాధానం ఇవ్వడంతో సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. ఇంకా చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రేవంత్‌కు కోర్టు తెలిపింది. అన్ని కేసుల్లో కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

గురుకుల టీచర్లకు ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మోడల్, గురుకుల టీచర్లకు ఫ్యామిలీ పెన్షన్ వర్తింపజేయాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ ఆఫీసులో స్టేట్ సీఫీఎస్ నోడల్ ఆఫీసర్, డీటీఏ డైరెక్టర్ రామచంద్రమూర్తికి సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఫ్యామిలీ, ఇన్‌వ్యాల్యుడేషన్ పెన్షన్ అమలు చేయడం లేదని, దీంతో వివిధ కారణాలతో మరణించిన 38 మంది ఉపాధ్యాయుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా మోడల్, గురుకుల ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం గుర్తించి ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

నాణ్యమైన భోజనం ఏది?

నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం జడ్పీ పాఠశాల విద్యార్థులు గురువారం నిరసనకు దిగారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెప్పడంతో విద్యార్థులు శాంతించారు.

ఎన్ఎంఐఎంఎస్‌యూలో ఫుడ్‌పాయిజన్

27 మంది విద్యార్థులకు అస్వస్థత • యాజమాన్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 20 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని నర్సీ మోంజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ యూనివర్సిటీలో గురువారం ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులను దవాఖానకు తరలించాల్సిన యాజమాన్యం యూనివర్సిటీలోనే ఓ డాక్టర్‌తో రహస్యంగా చికిత్స చేయించి ఉంచారు. మీడియాను యూనివర్సిటీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వచ్చి 27 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్న విషయాన్ని గుర్తించి వర్సిటీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో యాజమాన్యం అంబులెన్స్‌ను రప్పించి ప్రైవేటు దవాఖానకు తరలించారు. వైద్య, విద్యాశాఖాధికారులు శివకాంత్, జగదీశ్ యూనివర్సిటీకి చేరుకుని వివరాలు సేకరించారు. యూనివర్సిటీ క్యాంటీన్‌లో ఫుడ్ పాయిజన్ కావటంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు ఆరోపణలు వినిపించాయి. యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ మహేశ్ మాత్రం కొందరు విద్యార్థులు బయటి హోటళ్లలో ఫుడ్ తినడంతోనే అస్వస్థతకు గురైనట్టు చెప్పుకొచ్చారు.

రంజాన్ నెలలో 24 గంటలూ

షాపులు ఓపెన్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): రంజాన్ నెలలో దుకాణాలు 24 గంటలు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. మార్చి 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు దుకాణాలు నిరంతరం తెరిచి ఉంచుకోవచ్చని స్పష్టంచేసింది. ఈ మేరకు అనుమతిస్తూ కార్మికశాఖ కమిషనర్ సంజయ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నిబంధనల ప్రకారం సిబ్బందికి సెలవులు, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని స్పష్టంచేశారు. రోజుకు 8 గంటలు లేదా వారానికి 48 గంటలకు మించి వర్కర్లు పనిచేస్తే సాధారణ వేతనాల కంటే రెట్టింపు వేతనాలు ఇవ్వాలని కోరింది. సెలవు రోజుల్లో పనిచేసే ఉద్యోగులకు మరొక రోజు సెలవు ఇవ్వాలని తెలిపింది. ఒక్క ఆదివారం మినహా ఏ రోజు కూడా పని వేళలు 13 గంటలకు మించకూడదని పేర్కొంది. మహిళా ఉద్యోగులుంటే షరతులతో కూడిన నైట్ డ్యూటీలు వేయాలని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా న్యాయాధికారులు, ఇతర విభాగాల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, 24 గంటలూ షాపులు ఓపెన్ చేయాలనుకునే యాజమానులు సంబంధిత అధికారుల దగ్గర రశీదులు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

కులగణన రీసర్వేకు స్పందన కరువు!

- 4 రోజుల్లో సర్వేలో పాల్గొన్న 4 వేల కుటుంబాలు
- అంగన్‌వాడీ టీచర్ల వల్లనే సర్వే సరిగా జరగలేదు
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కులగణన రీసర్వేకు ప్రజల నుంచి స్పందన కరువైంది. నాలుగు రోజులుగా నమోదవుతున్న వివరాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం నిరుడు నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి సర్వేలో దాదాపు 3.54 కోట్ల మంది పాల్గొనగా, 16 లక్షల మంది సర్వేకు దూరంగా ఉన్నారు. ఆ సర్వేలో నమోదు చేసుకోని వారి కోసం ఈ నెల 16న ప్రభుత్వం రీసర్వే చేపట్టింది. 16వ తేదీ నుంచి గురువారం వరకు 4 రోజుల్లో 4625 కుటుంబాలు మాత్రమే రీసర్వేలో పాల్గొని వివరాల నమోదు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో 4,227, వెబ్‌సైట్ ద్వారా 398 మంది సర్వే ఫారాలు డౌన్‌లోడ్ చేసుకున్నట్టు సమాచారం. టోల్‌ఫ్రీ నంబర్ 040-2111111కు 6,415 కాల్స్ వచ్చినట్టు అధికారులు చెప్పారు.

వివరాలు ఇవ్వండి

"అంగన్‌వాడీ టీచర్ల వల్లనే కులగణన సర్వే కొంతవరకు సరిగా జరగలేదు. ప్రస్తుతం కొనసాగుతున్న రీసర్వేలోనైనా ప్రజలు వివరాలను నమోదు చేసుకోవాలి. సర్వేపై పలు రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రధానంగా అంగన్‌వాడీ టీచర్లపై కొందరు ఫిర్యాదులు చేస్తున్నారు. వారి కారణంగానే సర్వే సరిగా జరగడం లేదని చెప్తున్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 040-21111111ను సంప్రదిస్తే ఎన్యుమరేటర్లే ఇంటికి వచ్చి వివరాలను నమోదు చేసుకుంటారు."

-నిరంజన్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్

సన్నబియ్యం పంపిణీ ఎప్పుడు?

సంక్రాంతి నుంచే ఇస్తామని గొప్పలు • నెలరోజులు కావస్తున్నా ఊసెత్తని సర్కారు

- సరిపడా సన్నబియ్యం లేకపోవడమే ఆలస్యానికి కారణమా?
- ఏడాదికి కావాల్సిన ధాన్యం 38 లక్షల టన్నులు
- సర్కారు కొన్నది 24 లక్షల టన్నులే

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీపై స్పష్టత కరువైంది. దసరా, సంక్రాంతి అంటూ సర్కారు గడువు పొడగిస్తున్నదే తప్ప సన్నబియ్యం మాత్రం పంపిణీ చేయడం లేదు. సంక్రాంతి నుంచి పంపిణీ చేస్తామని గతంలో ప్రకటించిన ప్రభుత్వం.. ఇటీవల మార్చినుంచి ప్రారంభిస్తామని గొప్పగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే సంక్రాంతి అయిపోయింది. ఇప్పుడు మార్చి కూడా సమీపించింది. అయినప్పటికీ సన్నబియ్యం పంపిణీపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావడంలేదు. తాజా గడువులోపు కూడా పంపిణీ చేయడం కష్టమని పౌరసరఫరాల సంస్థ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సన్నబియ్యం కొరతే కారణమా?

సన్నబియ్యం పంపిణీ ఆలస్యానికి బియ్యం కొరతే కారణమని తెలుస్తున్నది. ప్రభుత్వ ప్రణాళికాలోపమే అందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సన్నబియ్యం పంపిణీకి సంబంధించి ప్రకటన చేసే సమయంలో ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక రూపొందించలేదని తెలిసింది. ఎంత బియ్యం అవసరం? ఆ మొత్తం ఎలా సమకూర్చుకోవాలి? బియ్యం ఎప్పుడు సిద్ధంగా ఉంటాయి? తదితర విషయాలపై కనీస చర్చ చేయనట్టు సమాచారం. అందుకే ప్రజలను మభ్యపెట్టేందుకు గుడ్డిగా హామీలు గుప్పించి.. ఆ తర్వాత గడువుల పేరుతో దాటవేస్తున్నది.

అధికారుల మల్లగుల్లాలు

రాష్ట్రంలో సుమారు 90 లక్షల రేషన్‌కార్డులుండగా 2.81 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. వీరితో పాటు హాస్టళ్లు, గురుకులాలు, మధ్యాహ్న భోజనం కోసం ఏటా సుమారు 25 లక్షల టన్నుల సన్నబియ్యం అవసరం. ఇందుకోసం 38 లక్షల టన్నుల ధాన్యం కావాలి. కానీ, ఈ వానకాలంలో ప్రభుత్వం మొత్తం 53.96 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 24 లక్షల టన్నులు మాత్రమే సన్నధాన్యం. ఈ లెక్కన ఇంకా 14 లక్షల టన్నుల సన్న ధాన్యం అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో అవసరమైన ధాన్యాన్ని ఎలా సమకూర్చుకోవాలనే ఆలోచనలో అధికారులున్నారు. దీంతో పాటు ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు కనీసం రెండు నెలల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పట్లో సన్నబియ్యం పంపిణీ కష్టమని అధికారులు చెబుతున్నారు.

కొత్త కార్డులకు ఇచ్చేనా?

ఇప్పటికే రాష్ట్రంలో 90 లక్షల కార్డులుండగా.. రాష్ట్ర సర్కారు కొత్త కార్డుల జారీ ప్రక్రియపై కసరత్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల వరకు కొత్త కార్డులు జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ లెక్కన కొత్తగా 18-20 లక్షల మంది లబ్ధిదారులు పెరిగే ఆస్కారమున్నది. వీరికీ ఇవ్వాలంటే మరింతగా సన్నబియ్యం అవసరం.

మంత్రి సురేఖ వర్సెస్ రేవూరి

- మళ్లీ బయటపడ్డ వర్గపోరు
- మంత్రి వర్గీయులంటూ సభ నిర్వహణకు పోలీసుల నిరాకరణ
- ఆర్జీపీఆర్ఎస్ జిల్లా స్థాయి శిక్షణ సమావేశానికి అడ్డు

గీసుగొండ, ఫిబ్రవరి 20: మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మధ్య వర్గపోరు మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా దేశవ్యాప్తంగా ఉన్న రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ సంస్థ జిల్లాస్థాయి శిక్షణా సమావేశం గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాలలో నిర్వహించేందుకు ఆర్జీపీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేశారు. సమావేశానికి జాతీయ ఉపాధ్యక్షుడు కునాల్ బెనర్జీ, రాష్ట్రాల ప్రతినిధులు వచ్చారు. సమావేశం నిర్వహణకు కొద్ది నిమిషాల ముందు పోలీసులు వచ్చి అనుమతి లేదంటూ ఇక్కడి నుంచి అందరూ వెళ్లిపోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆశ్చర్యానికి గురయ్యాయి. జిల్లాస్థాయి సమావేశానికి కాంగ్రెస్‌నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎవరూ వెళ్లవద్దని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి హుకుంజారీ చేయడంతో పాటు ఎవరైనా సమావేశానికి వెళితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నట్టు ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ ఆరోపించారు.

పీఎం కేర్స్ లబ్ధిదారులకు ఫ్రీ కోచింగ్

యూపీఎస్‌సీ, నీట్, జేఈఈ తదితర పరీక్షలకు శిక్షణ

న్యూఢిల్లీ : బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అత్యుత్తమ స్థాయి ఉచిత శిక్షణ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం, ఈ పథకం కింద షెడ్యూల్డు కులాలు (ఎస్సీ), ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీల) విద్యార్థులతో పాటు పీఎం కేర్స్ పథకం లబ్ధిదారులు కూడా ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులవుతారు. వీరికి వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ లభిస్తుంది. సామాజి